


బుర్ర కొమురయ్య గౌడ్



అంబాల శ్రీనివాస్

భూపాలపల్లి మున్సిపాలిటీ

## కాంగ్రెస్ కైవసం

- చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్
- బీఆర్ఎస్ 'హ్యాట్రిక్'కు బ్రేక్

05

## మున్సిపల్ పీఠాలపై గులాబీ వ్యూహం

- 8 హంగ్ మున్సిపాలిటీలకు ఇంచార్జీల నియామకం
- కాంగ్రెస్ అరాచకాలను ఎండగట్టండి.. కేటీఆర్ ఆదేశం

02



## పరకాల మున్సిపల్ పీఠం సునీల్ కైవసం!

- చైర్మన్‌గా పావుశెట్టి సునీల్ కుమార్ ఏకగ్రీవం
- అభినందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

03


సంపుటి :02 | సంచిక :308 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

సోమవారం 16, ఫిబ్రవరి 2026




- భూపాలపల్లి మున్సిపాలిటీలో 'హస్తం' పార్టీ ప్రప్రథమ బోణీ
- అంతా తానై నడిపించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- అభివృద్ధి చేయకుంటే పోటీ చేయనన్న 'జీఎస్ఆర్' మాటపై ఓటర్ల నమ్మకం
- చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం

05

# గండ్ర వ్యూహం ఫలించె.. మున్సిపల్ పీఠం దక్కె!

జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ రాజకీయం కొత్త చరిత్రకు నాంది పలికింది. మున్సిపాలిటీ ఏర్పడిన దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (GSR) తన అసాధారణ వ్యూహ చతురతతో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారు. ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా, పక్కా ప్రణాళికతో అంతా తానై నడిపించిన గండ్ర, మున్సిపల్ పీఠాన్ని ప్రప్రథమంగా కాంగ్రెస్ కైవసం చేసుకునేలా చేయడంలో విజయం సాధించారు. "అభివృద్ధి చేయకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను" అంటూ ఆయన చేసిన సాహసోపేతమైన సవాల్‌ను విశ్వసించిన ఓటర్లు, భూపాలపల్లి పాలకవర్గ పగ్గాలను హస్తం పార్టీకి అప్పగించారు. సోమవారం జరిగిన నాటకీయ పరిణామాల మధ్య చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టడంతో భూపాలపల్లిలో గండ్ర మార్క్ పాలన మొదలైంది.

- భూపాలపల్లి, అక్షరదర్బార్

05

# కాంగ్రెస్ విజయోత్సాహం !

ఉమ్మడి జిల్లాలో 9 బల్దియాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

- ఎన్నిక జరిగిన తొమ్మిది బల్దియాలూ కాంగ్రెస్ ఖాతాలోనే..
- సాంకేతిక కారణాలతో 3 చోట్ల ఎన్నిక వాయిదా
- ఆ మూడు చోట్ల రేపు ఉదయం తిరిగి ఎన్నిక

02



ఉమ్మడి వరంగల్ జిల్లా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. సోమవారం జరిగిన ఎన్నికల్లో తన ఆధిపత్యాన్ని చాటుతూ జిల్లాలోని 9 మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 12 స్థానాలకు గాను 9 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు పీఠాలను కైవసం చేసుకోగా, మిగిలిన మూడు చోట్ల సాంకేతిక కారణాలతో ఎన్నిక వాయిదా పడింది. పార్టీలోని అసంతృప్త నేతలను బుజ్జగించి ఏకతాటిపైకి తీసుకురావడంలో నాయకత్వం విజయవంతం కావడంతో మెజారిటీ స్థానాల్లో విజయం ఏకపక్షంగా సాగింది. ఉదయం కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం పరోక్ష పద్ధతిలో అధికారులు ఎన్నికను పూర్తి చేశారు. కాగా జనగామ, తొర్రూరు, డోర్నకల్ మున్సిపాలిటీల్లో వాయిదా పడిన ఎన్నికలను మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు.

– అక్షరదర్బార్, వరంగల్

## 20 నుంచి 23వరకు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్



- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి
- అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ, ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

05

ఎంపీ కడియం కావ్య ఓటుపై

## 'తొర్రూరు'లో రగడ!

- ఎన్నికల అధికారులకు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఫిర్యాదు

05

# కాంగ్రెస్ విజయోత్సాహం!

- ఉమ్మడి జిల్లాలో 9 బల్దియాల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- ఎన్నిక జరిగిన తొమ్మిది బల్దియాలూ కాంగ్రెస్ ఖాతాలోనే..
- సాంకేతిక కారణాలతో 3 చోట్ల ఎన్నిక వాయిదా
- ఆ మూడు చోట్ల రేపు ఉదయం తిరిగి ఎన్నిక



**అక్షరదర్బార్, వరంగల్**

ఉమ్మడి వరంగల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 12 మున్సిపాలిటీలకు గాను తొమ్మిది చోట్ల కాంగ్రెస్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంది. జనగామ, తొర్రూరు, డోర్నకల్ మున్సిపాలిటీల్లో వివిధ కారణాల వల్ల ఎన్నిక వాయిదా పడింది. వాయిదా పడిన మున్సిపాలిటీల్లో మంగళవారం ఉదయం పదకొండు గంటలకు ఎన్నిక నిర్వహించనున్నారు. మిగతా తొమ్మిది చోట్ల సోమవారం ఉదయం కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అధికారులు వెంటనే పరోక్ష పద్ధతిలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ తన అసంతృప్త నేతలను బుజ్జగించి ఏకతాటిపైకి తీసుకురావడంతో మెజారిటీ స్థానాల్లో విజయం ఏకపక్షంగా సాగింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల్లో సోమవారం ఉత్కంఠంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల ఎన్నిక జరిగింది. తొర్రూరు, జనగామ, డోర్నకల్ మున్సిపాలిటీల్లో రాజకీయ ఉద్రిక్తలు, సాంకేతిక కారణాల వల్ల చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన తొమ్మిది బల్దియాలను అధికార కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. తద్వారా ఉమ్మడి జిల్లాలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తొమ్మది చోట్లా ఎన్నికల సరళి ఉత్సాహంగా సాగింది. ఉదయం కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు ఆయా చోట్ల ప్రమాణ స్వీకారం చేశారు. అధికారులు వెను వెంటనే పరోక్ష పద్ధతిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక నిర్వహించారు. మెజారిటీ వార్డులను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ, అసంతృప్త నేతలను బుజ్జగించి ఏకతాటిపైకి తీసుకువచ్చారు. కొన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కూడా అధికార పార్టీకే లభించడంతో ఎన్నిక ఏకపక్షంగా ముగిసింది. ఎన్నికలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

### - చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు వీరే..

పరకాల పురపాలక సంఘం చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ గా ఏకు దివ్య ఎన్నికయ్యారు. వారికి ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ములుగు చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్ గా ఆసియా షాహిన్ ఎన్నికయ్యారు. వారికి ఆర్డీవో వెంకటేష్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కేసముద్రం చైర్‌పర్సన్‌గా సునీత, వైస్ చైర్మన్ గా అల్లం రమ ఎన్నికయ్యారు. నర్సంపేట చైర్‌పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్‌గా గంధం నరేందర్ ఎన్నికయ్యారు. ఆర్డీవో పోలం ఉమారాణి వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపల్లి చైర్‌పర్సన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుభాకాంక్షలు తెలిపారు. మహబూబాబాద్, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, మరిపెడ మున్సిపాలిటీలనూ కాంగ్రెస్సే దక్కించుకుంది, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల పదవులను కైవసం చేసుకుంది.

### - మూడుచోట్ల వాయిదా ఎందుకంటే..

ఎన్నిక వాయిదా పడిన మూడు మున్సిపాలిటీల విషయాని కొస్తే.. జనగామలో కౌన్సిలర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. కోరం కూడా లేకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. తొర్రూరులో కొన్ని సాంకేతిక ఇబ్బందులు తలెత్తగా, డోర్నకల్‌లో సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆలస్యం కావడంతో ఎన్నిక రేపటికి వాయిదా పడింది. ఈ మూడు మున్సిపాలిటీల్లో రేపు ఉదయం 11 గంటలకు తిరిగి ఎన్నిక జరుగనుంది. హంగ్ ఏర్పడిన కేసముద్రం, వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఎక్స్ అఫీషియో ఓటు హక్కు వినియోగించి కాంగ్రెస్ కౌన్సిలర్లను చైర్మన్లుగా గెలిపించారు




# ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

అక్షర దర్బార్, మహబూబాబాద్ : స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) ఇంజనీరింగ్ కళాశాలలో సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో భోగ్ భండారో ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. బలరాం నాయక్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ చూపిన బాట సమాజానికి ఎంతో ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. ఉన్నత విలువలతో కూడిన నవ సమాజ నిర్మాణం కోసం సేవాలాల్ మహరాజ్ అహర్నిశలు కృషి చేశారని, ముఖ్యంగా బంజారా సమాజంలో మద్యం, మాంసాహారం వంటి వ్యసనాలను నిరోధించి, ఇతరుల మనోభావాలను గౌరవించేలా వారిని చైతన్య పరిచారని ప్రిన్సిపాల్ వివరించారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంజారా పూజారులు, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# మున్సిపల్ పీఠాలపై గులాబీ వ్యూహం

- 8 హంగ్ మున్సిపాలిటీలకు ఇంచార్జీల నియామకం
- కాంగ్రెస్ అరాచకాలను ఎండగట్టండి.. కేటీఆర్ ఆదేశం

అక్షరదర్బార్, హైదరాబాద్ :
రాజకీయ ప్రతినిధి: రాష్ట్రంలోని హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ పార్టీ తన పట్టు బిగించేందుకు సిద్ధమైంది. ఈ మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 8 కీలక మున్సిపాలిటీలకు పార్టీ తరపున సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇంచార్జులుగా నియమిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ పీఠాలను దక్కించుకోవడంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు కేటీఆర్ అనుభవజ్ఞులైన నేతలకు బాధ్యతలు అప్పగించారు. తోర్రూర్ బాధ్యతలను మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పెద్ది సుదర్శన్ రెడ్డిలకు అప్పగించగా.. ఇబ్రహీంపట్నం బాధ్యతలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులకు అప్పగించారు.

### - మున్సిపాలిటీల వారీగా ఇంచార్జీలు

**తొర్రూర్:** మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, పెద్ది సుదర్శన్ రెడ్డి.
**జనగామ:** బండా ప్రకాష్ (మండలి డిప్యూటీ చైర్మన్), పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి (ఎమ్మెల్సీ).
**క్యాతనపల్లి:** ఎమ్మెల్యే కోవ లక్ష్మి.
**ఖానాపూర్:** ఎమ్మెల్యే అనిల్ జాదవ్.
**ఇంద్రేశం:** ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి.
**కాగజ్‌నగర్:** మాజీ మంత్రి జోగు రామన్న.
**జహీరాబాద్:** ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునితా లక్ష్మారెడ్డి.
**ఇబ్రహీంపట్నం:** ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.

### - కార్యకర్తలకు దిశానిర్దేశం

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచకాలను, ప్రలోభాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కేటీఆర్ ఇంచార్జీలకు సూచించారు. పార్టీ శ్రేణులను ఏకం చేస్తూ, స్థానిక ప్రజల మద్దతుతో ఈ 8 మున్సిపాలిటీలను బీఆర్ఎస్ ఖాతాలో వేయడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ నియామకాలతో మున్సిపల్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

# రేపు కేసీఆర్ జన్మదిన వేడుకలు

- గ్రామ గ్రామాన గులాబీ జెండా పండుగ : కవిత మాలోత్ పిలుపు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధకులు, జాతి పిత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలను రేపు (మంగళవారం) జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని భారాస జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత మాలోత్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామ గ్రామాన ఈ వేడుకలను ఉత్సవంలా జరపాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రదాత కేసీఆర్ గారి పుట్టినరోజును పురస్కరించుకొని భారీ ఎత్తున రక్తదాన శిబిరాలు, పేదలకు అన్నదానాలు, పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామంలో గులాబీ జెండాను ఆవిష్కరించి, కేసీఆర్ రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తుచేసుకోవాలన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కవిత మాలోత్ కోరారు.



# సునీల్ అనే నేను..

- ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా
- మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రాధాన్యం
- మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్



పావుశెట్టి సునీల్ కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు




అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 13 సీట్లు గెలుచుకోగా, బీఆర్ఎస్ 6, బీజేపీ 3 స్థానాలు సాధించాయి. సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు క్యాంప్ నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ముందుగా కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నిర్వహించిన చైర్మన్ ఎన్నికల్లో 7వ వార్డు నుంచి గెలుపొందిన కౌన్సిలర్ పావుశెట్టి సునీల్ కుమార్‌ను ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అధికారుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయగా, కౌన్సిల్ సభ్యులు నూతన చైర్మన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ సునీల్ కుమార్ మాట్లాడుతూ పరకాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. పట్టణంలో రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సరఫరా మెరుగుదల, వీధి దీపాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసి శుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పట్టణంలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల లోటును దశలవారీగా పరిష్కరిస్తామని, అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక పర్యటనలు నిర్వహించి వేగంగా పరిష్కార చర్యలు చేపడతామని చైర్మన్ సునీల్ కుమార్ వెల్లడించారు.పరకాలను ఆదర్శ పట్టణంగా నిలిపేందుకు సమిష్టిగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## పరకాల మున్సిపల్ చైర్మన్ గా పావుశెట్టి సునీల్

- వైస్ చైర్మన్ గా ఏకు దివ్య
- వైభవంగా ప్రమాణ స్వీకారం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 13 సీట్లు గెలుచుకోగా, బీఆర్ఎస్ 6, బీజేపీ 3 స్థానాలు సాధించాయి. సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు కార్యాలయానికి చేరుకుని పరకాల ఆర్ డి ఓ డా.నారాయణ కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. 7వ వార్డు నుంచి గెలుపొందిన కౌన్సిలర్ పావుశెట్టి సునీల్ కుమార్‌ను చైర్మన్‌గా,4 వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన ఏకు దివ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కౌన్సిల్ సభ్యులు నూతన చైర్మన్, వైస్ చైర్మన్ లను అభినందించారు.ఈ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరై కౌన్సిలర్లను అభినందించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.





### వైస్ చైర్మన్ ఎంపికపై ఉద్రిక్తత

పరకాల మున్సిపల్ చైర్మన్‌గా పావుశెట్టి సునీల్ ప్రమాణ స్వీకారం అనంతరం వైస్ చైర్మన్ ఎన్నికను చేపట్టాల్సి ఉండగా, ఏకాభిప్రాయం కుదరక ఆర్డీఓ రేపటికి వాయిదా వేశారు. ఇదే సమయంలో నాలుగో వార్డు కౌన్సిలర్ దివ్యను వైస్ చైర్మన్‌గా ఎంపిక చేస్తారని సమాచారం వెలువడటంతో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఏసీపీ సతీష్ కుమార్ జోక్యం చేసుకుని శాంతి భద్రతలు కట్టుదిట్టం చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తమను బయటకు పంపించి వైస్ చైర్మన్ ఎన్నిక ఎలా నిర్వహిస్తారని ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రశ్నించారు.





## రాష్ట్రస్థాయి పోటీలకు అకిరానంద్ ఎంపిక

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం లోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన పసరగొండ అఖిరానంద్ ఈ నెల 7వ తేదీన భూపాలపల్లి జిల్లాలోని అంబేద్కర్ స్టేడియం లో జిల్లా యువజన క్రీడా , బాస్కెట్బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన క్రీడలలో అకిరానంద్ ఎంపికయ్యారు, క్రీడలలో అకిరానంద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్టు అసోసియేషన్ బాధ్యులు అధ్యక్షులు గంధ్ర సత్యనారాయణ రావు ప్రధాన కార్యదర్శి సంగి చరత్, కోశాధికారి సౌదరి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి పాడుగుల శివకుమార్, జిల్లా యువజన క్రీడాల అధికారి చిర్ర రఘు ఒక ప్రకటనలో తెలిపారు, ఈ నెల 20నుండి 23వరకు జరుగు రాష్ట్ర స్థాయి పోటీలు నిజామాబాదు లో నిర్వహించనున్నట్లు తెలిపారు

## నాగూర్ల పరామర్శ.

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం ఇసిపేట గ్రామానికి చెందిన రాజేశ్వరరావు మల్యాల రాజేశ్వరరావు కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మొగుళ్లపల్లి మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు చదువు అన్నా రెడ్డి, చిట్యాల మాజీ మార్కెట్ చైర్మన్ కొడారి రమేష్, మాజీ జెడ్పిటిసి పర్లపల్లి సర్పంచ్ జోరుక సదయ్య, మాజీ ఎంపిటిసి పిన్నింటి వెంకట్రావు ,బీఆర్ఎస్ పార్టీ లీడర్లు లింగంపల్లి బాపూరావు, ఓల్డ్ ఇస్‌పేట ఉపసర్పంచ్ నేర్పాటి శ్రీనివాస్, జయపాల్,జన్ని కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ఖాతాలో నర్సంపేట మున్సిపల్ పీఠం

- చైర్ పర్సన్ గా పెండెం శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్ గా గంధం నరేందర్ ప్రమాణ స్వీకారం
- హాజరైన ఎమ్మెల్యే దొంతి



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ పీఠం కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లింది. నూతన పాలకవర్గ ఏర్పాటు సందర్భంగా చైర్‌పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్‌గా గంధం నరేందర్ పూర్తి మెజారిటీతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ప్రత్యేక మున్సిపల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఇద్దరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నర్సంపేట ఆర్డీవో పోలం ఉమారాణి అధికారికంగా ప్రకటించారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ కమిషనర్ భాస్కర్ నూతన పాలకవర్గాన్ని శాలువాలు, పూల బొకేలతో సత్కరించారు.

### కాంగ్రెస్ కు స్పష్టమైన ఆధిక్యం

మొత్తం 30 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 21 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఈ సంఖ్యాబలంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు కాంగ్రెస్ వశమయ్యాయి. దీంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేసి నర్సంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

## కీప్ ఇట్ అప్ శ్రీలక్ష్మి

- చైర్మన్ కి ఎమ్మెల్యే దొంతి ఆశీర్వాదం

అక్షర దర్బార్, నర్సంపేట: అభివృద్ధి అంటే ఏమిటో నర్సంపేట ప్రాంత ప్రజలకు చూపెట్టాలని అండగా నేనుంటా కీప్ ఇట్ అప్ అంటూ నూతన మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీలక్ష్మీని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆశీర్వదించి శుభాకాంక్షలు అందజేశారు నర్సంపేట అభివృద్ధి ధ్యేయంగా ప్రజాసంక్షేమానికి నిత్యం పాటు పడుతూ ముందుకెళ్లాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి నూతన మున్సిపల్ చైర్మన్ శ్రీలక్ష్మీకి సూచించారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



అక్షరదర్బార్, నల్లబెల్లి: మండలంలోని బిల్ నాయక్ తండా జాతీయ రహదారి 365 పై ఆగి ఉన్న ట్రాక్టర్ ను వెనక నుంచి ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిల్ నాయక్ తండా గ్రామ శివారు జాతీయ రహదారి 365పై నర్సంపేట నుంచి అడవి మల్లంపల్లి వైపునకు వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా ఆగింది. దీంతో దాని వెనుక వస్తున్న ఆటో అదుపుతప్పి ట్రాక్టర్ ని ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న గూడూరు మండలం మట్టేవాడకి చెందిన రత్నమాల, హరిబాబులు తీవ్రంగా గాయపడ్డారు. దాంతో వారిని హుటాహుటిన స్థానికులు నర్సంపేటలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.



## కేసముద్రం మున్సిపల్ చైర్మన్ గా బానోత్ సునీత

**- వైస్ చైర్మన్ గా అల్లం రమ ఎన్నిక**

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు, బీఆర్ఎస్ 8 స్థానాలు గెలుచుకొని హంగ్ ఏర్పడింది. దీంతో స్థానిక ఎంపీ ఓటుతో కేసముద్రం మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది.ఈ నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కౌన్సిలర్ లు వారి వారి క్యాంప్ ల నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అధికారులు వారితో ముందుగా కౌన్సిలర్లుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిర్వహించిన చైర్మన్ ఎన్నికల్లో 2వ కౌన్సిలర్ బానోత్ సునీత, వైస్ చైర్మన్ గా అల్లం రమ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సునీత మాట్లాడుతూ.. కేసముద్రం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.

## మరిపెడ మోడల్ స్కూల్ లో ప్రవేశాలు

అక్షర దర్బార్,మరిపెడ : మరిపెడ మండల కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి (నూతన ప్రవేశాలు), మరియు 7 నుండి 10వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ అక్తరుజ్జమాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పార్టీ ప్రయోజనాలే ముఖ్యం

- వెన్నుపోటు రాజకీయాలు సహించం
- ములుగు మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్ల సన్మాన సభలో మంత్రి సీతక్క
- చైర్ పర్సన్ గా చింతనిప్పుల చంద్రకళ భిక్షపతి, వైస్ చైర్మన్ గా ఆసియా షాహిన్ ప్రమాణ స్వీకారం



అక్షర దర్బార్, ములుగు: ములుగు మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన చింతనిప్పుల చంద్రకళ భిక్షపతి సన్మాన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. కాంగ్రెస్ తరపున గెలిచిన కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ములుగులో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అన్ని అంశాలను పరిశీలించి చైర్‌పర్సన్‌గా చింతనిప్పుల చంద్రకళ భిక్షపతిని ఎన్నుకున్నామని చెప్పారు. సీనియర్ నాయకుడు, ములుగు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న భిక్షపతికి నిబద్ధత, చిత్తశుద్ధి ఉన్నాయని కొనియాడారు. గతంలో ఒత్తిడులు వచ్చినా పార్టీ మారకుండా పనిచేశారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడని అన్నారు. అవకాశం రానివారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో అందరికీ అవకాశాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. తనకు అందరూ సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ ఓటమికి వెన్నుపోటు రాజకీయాలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీలో ఉండి మోసం చేయడం క్షమించరాని నేరమని, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎవరు వెన్నుపోటు రాజకీయాలు చేశారో తమకు తెలుసని, పద్ధతి మార్చుకోవాలని ఇది చివరి హెచ్చరిక అని అన్నారు. రియల్ ఎస్టేట్ మాఫియా కోట్లు ఖర్చు చేసినా ప్రజలు కాంగ్రెస్‌కే మద్దతు ఇచ్చారని తెలిపారు. కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే ప్రతి ఎన్నికలో విజయం సాధ్యమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ మున్సిపల్ పీఠంపై 'విద్యావేత్త'..

- చైర్ పర్సన్ గా విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ప్రమాణస్వీకారం



అక్షర దర్బార్,మరిపెడ : మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ గా విద్యావేత్తగా, సేవా దృక్పథం కలిగిన నాయకుడిగా ప్రజల మన్ననలు పొందిన విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ సంపూర్ణ ఆశీస్సులతో, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతను ఆయనకు అప్పగించింది. వివాదరహితుడిగా, అడిగిన వారికి సాయం చేసే గుణవంతుడిగా పట్టణ ప్రజల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రగతి శ్రీపాల్ రెడ్డి ప్రమాణస్వీకారం సందర్భంగా మరిపెడ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మరిపెడ అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తానని, ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ప్రగతిశ్రీపాల్ రెడ్డి ఆకాంక్షించారు.

## గుడుంబా సేవించి ఇద్దరి మృతి

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలో గుడుంబా మత్తుతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గతంలోనూ పలువురు మృతి చెందగా, మరికొందరు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో 5–6 గుడుంబా కేంద్రాలు నిర్భయంగా నడుస్తున్నాయని, అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్, పోలీసులు గుడుంబా కేంద్రాలపై దాడులు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టర్‌కు సామూహిక ఫిర్యాదు చేస్తామని స్థానిక యువకులు హెచ్చరించారు.

# కాంగ్రెస్ విజయం ప్రజల విశ్వాస ఫలితం

- ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు
- 'చల్లా' చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి








అక్షరదర్బార్, పరకాల: తనపై విశ్వాసంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన పట్టణ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించినట్లే మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, వారి విశ్వాసాన్ని వమ్ము చేయకుండా పట్టణాభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

### రూ.11 కోట్లతో మంచినీటి పనులు పూర్తి

పట్టణంలో డ్రైనేజీ, రహదారుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రూ.11 కోట్ల వ్యయంతో చేపట్టిన మంచినీటి వసతి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కమిటీ నిపుణుల నివేదిక ప్రకారం జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అవకాశాలు ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంపై తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

### ఇండోర్ స్టేడియంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

పట్టణాభివృద్ధి దిశగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఇండోర్ స్టేడియంగా మార్చే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయనున్నామని, ప్రభుత్వంనుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు.

### పరకాలలో రౌడీ వ్యవస్థ నిర్మూలన

పట్టణంలో ఏ పార్టీకి చెందిన వారైనా రౌడీ వ్యవస్థకు తావివ్వబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. రౌడీ సంస్కృతిని పూర్తిగా రూపుమాపే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

### విజయోత్సవ ర్యాలీ ...

విలేకరుల సమావేశం అనంతరం మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ ఏకు దివ్యతో పాటు 11 మంది కౌన్సిలర్లతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బస్టాండ్, పోచమ్మ గుడి, అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగి విజయోత్సవ సభ జరిగింది. సభలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### కౌన్సిలర్ల కొనుగోలు యత్నం విఫలం

మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లు హైదరాబాద్‌లోని రిసార్టులో ఉన్న విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి వారిని కొనుగోలు చేసేందుకు చిల్లర రాజకీయాలకు దిగారని ఆరోపించారు. కొందరిని పంపించి ఆశలు చూపే ప్రయత్నం చేశారని, అయితే ముందుగానే పసిగట్టి తగిన బుద్ధి చెప్పామని తెలిపారు. ఇలాంటి నీచ రాజకీయాలకు స్వస్తి పలకాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

# ఎంపీ కడియం కావ్య ఓటుపై 'తొర్రూరు'లో రగడ!

- ఎన్నికల అధికారులకు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఫిర్యాదు
- జీడబ్ల్యూఎంసీలో సభ్యత్వం ఉండి ఇక్కడెలా ఓటు వేస్తారు?
- నిబంధనలకు విరుద్ధమంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన తుర్పాటి రవి

అక్షర దర్బార్, తొర్రూర్ : తొర్రూరు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎక్స్-అఫీషియో మెంబర్‌గా ఓటు వేయడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు తొర్రూరు మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ తుర్పాటి రవి ఆదివారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

### ఫిర్యాదులోని ముఖ్యాంశాలు:

ఎంపీ కడియం కావ్య ఇప్పటికే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC)లో ఎక్స్-అఫీషియో సభ్యురాలిగా నమోదు చేసుకున్నారని, తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఒక మున్సిపాలిటీలో సభ్యత్వం ఉన్న వారు మరోచోట ఓటు వేయడానికి వీల్లేదని కౌన్సిలర్ రవి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నోటిఫై అయిన సభ్యత్వాన్ని మరో మున్సిపాలిటీకి బదిలీ చేయడం దా రెండు చోట్లా కొనసాగించడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.

### ఎన్నిక చెల్లుబాటుపై ఆందోళన..

న్యాయపరమైన అధికార పరిధి లేకుండా ఎంపీని ఓటింగ్ ప్రక్రియలో పాల్గొననిస్తే, మొత్తం ఎన్నికల ప్రక్రియే చట్టపరమైన చిక్కుల్లో పడుతుందని ఫిర్యాదులో హెచ్చరించారు. తక్షణమే ఎంపీ కడియం కావ్య ఓటు హక్కుపై విచారణ జరిపి, ఆమెను ఓటింగ్ నుండి తప్పించాలని, ఈ అభ్యంతరాన్ని అధికారిక రికార్డుల్లో నమోదు చేయాలని రవి డిమాండ్ చేశారు. చైర్మన్ ఎన్నికకు ముందే ఈ విషయాన్ని తేల్చాలని కోరడంతో ఇప్పుడు అధికారుల నిర్ణయంపై అందరి దృష్టి నెలకొంది.









# ఇది ప్రజల విజయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ గా అంబాల శ్రీనివాస్ ఎన్నిక
- ప్రమాణ స్వీకారం చేసిన ఎన్నికైన 30 మంది కౌన్సిలర్లు
- చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను బైకాట్ చేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- మున్సిపల్ పీఠంపై మొదటి సారిగా కాంగ్రెస్ జెండా
- అంతా తానై నడిపించిన స్థానిక ఎమ్మెల్యే జీఎస్ఆర్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: భూపాలపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ చరిత్రలో తొలిసారిగా కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతో చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో భూపాలపల్లి రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

### ప్రమాణ స్వీకారోత్సవం

సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన 30 మంది కౌన్సిలర్లతో పాటు నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో అసిస్టెంట్ ఎన్నికల అధికారి, భూపాలపల్లి ఆర్డీవో హరికృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు.

### చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా, ఈ ప్రక్రియను బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు బైకాట్ చేశారు. ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు, మిత్రపక్షమైన సీపీఐకి చెందిన ఒక కౌన్సిలర్, ఒక స్వతంత్ర కౌన్సిలర్ కలిపి మొత్తం 18 మంది పాల్గొన్నారు.

– మున్సిపల్ చైర్మన్‌గా 2వ వార్డు కౌన్సిలర్ బుర్ర కొమురయ్య (కాంగ్రెస్)ను 9వ వార్డు కౌన్సిలర్ అప్పం కిషన్ ప్రతిపాదించగా, 19వ వార్డు కౌన్సిలర్ కురిమిల్ల శ్రీనివాస్ బలపరిచారు.

– వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ (కాంగ్రెస్)ను 30వ వార్డు కౌన్సిలర్ బొడ్డు అశోక్ ప్రతిపాదించగా, 20వ వార్డు కౌన్సిలర్ ఇస్లావత్ రాజు నాయక్ బలపరిచారు. కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉండటంతో చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఆర్డీవో హరికృష్ణ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. "మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లభించిన ఈ అఖండ విజయం పూర్తిగా భూపాలపల్లి ప్రజలదే. ప్రజలు ఇచ్చిన విశ్వాసంతో మా బాధ్యత మరింత పెరిగింది. నిజాయితీగా, అవినీతికి తావు లేకుండా భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి చేస్తాం" అని తెలిపారు. ఈ విజయం అందించిన మున్సిపాలిటీలోని అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### తొలిసారి కాంగ్రెస్ కు మున్సిపల్ పీఠం

భూపాలపల్లి 2012లో నగర పంచాయతీగా ఏర్పడి, అనంతరం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి జరిగిన రెండు మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనే పీఠాన్ని కైవసం చేసుకుంది. మూడోసారి హ్యాట్రిక్ సాధించాలన్న బీఆర్ఎస్ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈసారి కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని తొలిసారిగా దక్కించుకోవడం రాజకీయంగా విశేషంగా మారింది.

### 'అంతా తానై నడిపించిన' ఎమ్మెల్యే

ఈ విజయానికి ప్రధాన కారణంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పక్కా ప్రణాళిక, వ్యూహాత్మక ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. ప్రతి వార్డులో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రతి ఓటర్ని కలిసేలా చేసి, స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీలు ఇచ్చారు. భూపాలపల్లిలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులను ప్రజలకు వివరించారు. అభివృద్ధి పనులు పూర్తి చేయకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనని ఎమ్మెల్యే చేసిన ప్రకటన ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని కలిగించింది. దీంతో భూపాలపల్లి ప్రజలు కాంగ్రెస్ పార్టీపై పూర్తి నమ్మకం ఉంచి, మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించి కాంగ్రెస్‌కు మున్సిపాలిటీ పీఠాన్ని అందించారు.

# మానుకోటలో కాంగ్రెస్ కు పరాభవం తప్పదు

- సీపీఐ నేత అజయ్ సారథి ధ్వజం
- స్వతంత్రులకు కండువాలు కప్పి గెలిచామనడం హాస్యాస్పదం
- మిత్రపక్షానికి నమ్మకద్రోహం చేసినందుకు తగిన శాస్తి
- ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కౌన్సిలర్

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల పరిణామాలపై సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ బి. అజయ్ సారథి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సొంతంగా అభ్యర్థిని నిలబెట్టుకోలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఒక స్వతంత్ర అభ్యర్థికి చైర్మన్ పీఠం ఇచ్చి.. దానిని తమ విజయంగా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అసలు కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థే లేరా? లేక ఈ వ్యవహారం వెనుక ఏదైనా లోపాయికారీ మతలబు ఉందా? అని ఆయన నిలదీశారు.




### మిత్రద్రోహానికి తగిన గుణపాఠం..

మున్సిపల్ రాజకీయాల్లో మిత్రపక్షమైన సీపీఐకి కాంగ్రెస్ పార్టీ ఘోరమైన నమ్మకద్రోహం చేసిందని అజయ్ సారథి మండిపడ్డారు. ఈ అన్యాయానికి మానుకోట గడ్డపై కాంగ్రెస్‌కు తగిన శాస్తి జరిగిందని, భవిష్యత్తులోనూ ఇలాంటి పరాభవాలే ఎదురవుతాయని హెచ్చరించారు. స్వతంత్ర అభ్యర్థులకు కాంగ్రెస్ కండువాలు కప్పి గెలిచామని ప్రగల్భాలు పలకడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు.

### ఓటర్ల తీర్పు అమోఘం..

కాంగ్రెస్ పార్టీ ఎన్ని ఎత్తుగడలు వేసినా, ఎన్ని రకాలుగా ప్రలోభాలకు గురిచేయాలని చూసినా లొంగకుండా.. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఐ అభ్యర్థులను ఆశీర్వదించిన మానుకోట ఓటర్లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం నేర్పిన మున్సిపల్ పరిధిలోని ప్రజలందరికీ ఆయన వందనాలు సమర్పించారు.

# 20 నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

* హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి
* అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ, ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: సీఎం కప్ రెండో ఎడిషన్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా అథ్లెటిక్స్ కు సంబంధించిన పోటీలు హనుమకొండ జిల్లాలో ఈ నెల 20 నుండి 23వ తేదీ వరకు జరగనున్నాయని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ హనుమకొండ జేఎన్ఎస్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి దాదాపుగా పదిహేను వందల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి అశోక్ కుమార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, డీపీఈఓ గోపాల్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, అధికారులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915